

## పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** ప్రతిఒక్కరు తమ నివాస ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని వడూర్ గ్రామ సర్పంచ్ ఆడెపు శ్రీకాంత్ అన్నారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శనివారం రెండో రోజు వడూర్ గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని రైతు వేదిక, అంగన్వాడీ కేంద్రం వద్ద పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్ల పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టి పరిసరాలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ప్రతిఒక్కరూ గ్రామ పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎరడ్ల మమత చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి సద్దాం, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## మహిళలకు అండగా 'అక్షయ ఫౌండేషన్'



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంచిర్యాల అక్షయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెన్నూర్ మండలం అక్కెపల్లి గ్రామంలో నిరుపేద గిరిజన మహిళలకు నిత్యావసర సరుకులు, బేడ్‌షీట్లు, వస్త్రాలు పంపిణీ చేశారు. అనంతరం మహిళలను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు ఉషా సురేష్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుపేద మహిళల మధ్య మహిళా దినోత్సవాన్ని జరుపుకోవాలని సంకల్పించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. మహిళలు చైతన్యవంతులు కావాలని, అన్ని రంగాల్లో ముందుండాలని కోరారు. అక్షయ ట్రస్ట్ తరపున గత ఆరు సంవత్సరాలుగా మంచిర్యాల జిల్లాలో మారుమూల ప్రాంతాల్లో నివసించే నిరుపేదలకు నిత్యావసర సరుకులు అందిస్తూ సహాయం చేస్తున్నామని పేర్కొన్నారు. మహిళలు చదువుతో పాటు నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకుంటే కుటుంబాలు ఆర్థికంగా బలపడతాయని చెప్పారు. మహిళ శక్తిగా మారినప్పుడు దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తిరుమల, శ్రీవాణి, పద్మ, రజిత, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవం



**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:** కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీదేవి మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ప్రధాన పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. మహిళల సాధికారతతోనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి.లక్ష్మీనరసింహం మాట్లాడుతూ సమాజంలోని అన్ని రంగాల్లో మహిళలు తమ ప్రతిభను చాటుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో కూడా ముందుకు సాగడం అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా కళాశాలలోని మహిళా లెక్చరర్లను కళాశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ డి.జనార్ధన్, మహిళా సాధికారత విభాగం ఇన్‌చార్జ్ బి.రోజ్ మేరీ, ఐక్యూఏసీ ఇన్‌చార్జ్ డాక్టర్ శారద, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ




**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** మంచిర్యాల పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ఐఎన్‌టీఎస్ఓ పరీక్షల్లో ప్రతిభ కనబర్చారు. గత ఏడాది డిసెంబర్ నెలలో నిర్వహించిన ఈ పరీక్షల ఫలితాలు ఈనెల 5న ప్రకటించారు. ఈ పరీక్షల్లో శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థి శివరాం ల్యాప్‌టాప్‌ను కైవసం చేసుకోగా, 9వ తరగతి విద్యార్థిని అక్షిత, 3వ తరగతి విద్యార్థి కార్తికేయ సిద్ధి ట్యాబ్లను గెలుచుకున్నారు. ప్రతిభావంతులైన ఈ విద్యార్థులకు మంచిర్యాల జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి యాదయ్య మాట్లాడుతూ భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలు సాధించాలని సూచించారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ శ్రీవిద్య, చైర్మన్ శ్రీధర్, ఏజీఎం అరవింద్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సంజీవ్, ఉపాధ్యాయులు పరీక్షల్లో విజయం సాధించిన విద్యార్థులను అభినందించారు.

# మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

### జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 99 రోజుల 'ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మహిళా ఉద్యోగుల కోసం నిర్వహించిన వివిధ క్రీడా పోటీలను మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూషతో కలిసి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మహిళ ఉద్యోగులకు రన్నింగ్ రేస్, మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్ వంటి వివిధ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యాశాఖ, మెప్మా, మహిళా శిశు సంక్షేమ శాఖ తదితర విభాగాల నుంచి మహిళా ఉద్యోగులు పాల్గొనడం అభినందనీయమని కొనియాడారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని స్టేడియం వద్ద మెడికల్ క్యాంపును ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి మహిళా దినోత్సవ వేడుకల్లో బహుమతులు అందజేస్తామని వివరించారు. అనంతరం సీఎం కప్ పోటీల్లో గెలుపొందిన విజేతలను కలెక్టర్, మున్సిపల్ చైర్‌పర్సన్ మెడల్స్‌తో సత్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మహిళా ఉద్యోగులతో కలిసి వివిధ క్రీడల్లో పాల్గొని వారిని ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, మున్సిపల్ కమిషనర్ రాజు, డీవైఎస్ఓ శ్రీనివాస్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, వార్డ్ కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

# న్యూరో సర్జన్‌గా తాండూర్ బిడ్డ

### ఆల్ ఇండియాలో 4వ ర్యాంక్



**ఉద్యమ కెరటం, తాండూర్:** న్యూరో సర్జరీ ఎగ్జిట్ పరీక్షల్లో ఆల్ ఇండియా స్థాయిలో 4వ ర్యాంక్, రాష్ట్ర స్థాయిలో 1వ ర్యాంక్ సాధించి తాండూర్ మండలానికి చెందిన డాక్టర్ బండారి తిరుపతి ప్రతిభ కనబర్చారు. పట్టుదలతో కష్టపడితే అసాధ్యం అనేది ఏదీ లేదని తన విజయంతో నిరూపించారు. మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలోని రాజీవ్ నగర్‌కు చెందిన బండారి తిరుపతి మధ్యతరగతి కుటుంబంలో జన్మించి, తెలుగు మాధ్యమంలో చదువుకుంటూ న్యూరో సర్జన్‌గా ఎదిగి యువతకు ఆదర్శంగా నిలిచారు. తాండూర్‌లోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో 1 నుంచి 6వ తరగతి వరకు చదివిన ఆయన, అనంతరం శ్రీ విష్ణు శివ నికేతన్ హైస్కూల్‌లో 7 నుంచి 10వ తరగతి వరకు విద్యను అభ్యసించారు. తర్వాత బెల్లంపల్లి ప్రగతి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. విద్యాభ్యాసంలో కొన్ని అపజయాలు ఎదురైనా వెనక్కి తగ్గకుండా కష్టపడి 2009లో నిర్వహించిన ఈఎంసెట్ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో 72వ ర్యాంక్ సాధించారు. భౌతిక శాస్త్రంలో రాష్ట్ర ప్రథమ స్థానం సాధించి ఎంబీబీఎస్ సీటు పొందారు. అనంతరం కరీంనగర్‌లోని చల్మెడ ఆనందరావు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. తర్వాత నీట్ పీజీ పరీక్షలో ఎంఎస్ జనరల్ సర్జరీ సీటు సాధించి అదే కళాశాలలో పీజీ పూర్తి చేశారు. సీనియర్ రెసిడెంట్‌గా పనిచేస్తూ సూపర్ స్పెషాలిటీ ప్రవేశ పరీక్షలకు సిద్ధమై నీట్ సూపర్ స్పెషాలిటీ పరీక్షలో ఆల్ ఇండియా స్థాయిలో 68వ ర్యాంక్ సాధించారు. దీంతో హైదరాబాద్‌లోని సిటీ న్యూరో సెంటర్‌లో డీఎన్‌బీ న్యూరోసర్జరీ రెసిడెన్సీలో చేరారు. ప్రస్తుతం హైదరాబాద్ బంజారా హిల్స్‌లోని సిటీ న్యూరో సెంటర్‌లో కన్సల్టెంట్ న్యూరోసర్జన్‌గా పనిచేస్తూ అడ్వాన్స్‌డ్ బ్రెయిన్, స్పైన్ సర్జరీల్లో సేవలందిస్తున్నారు. చిన్న గ్రామం నుంచి తెలుగు మాధ్యమంలో చదువుకుని న్యూరో సర్జన్‌గా ఎదిగిన డాక్టర్ బండారి తిరుపతి యువతకు ఆదర్శంగా నిలిచారు.

# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం




**ఉద్యమ కెరటం, పాల్వంచ:** సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా స్థానిక నవ లిమిటెడ్ పాల్వంచ సంస్థ ఏర్పాటు చేసిన నవ మహిళ సాధికార కేంద్రంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సునీత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తాటాకుల కళాకృతుల శిక్షకురాలు అమ్ముద మహిళలతో తన అనుభవాలను పంచుకుని, స్వయం ఉపాధి ద్వారా మహిళలు ఆర్థికంగా ఎలా అభివృద్ధి చెందాలో వివరించారు. మహిళలు సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ రంగాల్లో సాధించిన విజయాలను గుర్తించి గౌరవించేందుకు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటామని తెలిపారు. మహిళల ఆర్థికాభివృద్ధి, సాధికారత కోసం నవ లిమిటెడ్ చేపడుతున్న కార్యక్రమాలను ప్రశంసించారు. ఎస్‌బీఐ క్యాషియర్ సింధు మాట్లాడుతూ నవ మహిళా సాధికార కేంద్రం ద్వారా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలను మహిళలు వినియోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా అతిథులను ఘనంగా సన్మానించారు. అనంతరం మహిళా సాధికార కేంద్రంలో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్ సింధు, ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజర్ కళ్యాణి, మహిళా సాధికార కేంద్ర సిబ్బంది టి.అరుణ, అమ్ముద, అరుణ, కవిత, దివ్య, వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు పాల్గొన్నారు.

# నూతన కౌన్సిలర్లు, సర్పంచ్‌లకు ఘన సన్మానం



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్‌తో పాటు కౌన్సిలర్లు, సర్పంచ్‌లను శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలను ఎల్లవేళలా కంటికి రెప్పలా కాపాడుకుంటానని అన్నారు. డబ్బు కోసం రాజకీయాల్లోకి రాలేదని, ఆదిలాబాద్ ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. బేల మండల కేంద్రంలో తన సొంత స్థలంలో పార్టీ కార్యాలయం నిర్మిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ వార్డుల్లో ప్రజలు నమ్మకంతో ఓటు వేసి గెలిపించినందున కౌన్సిలర్లు, చైర్‌పర్సన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. పట్టణ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ సహకరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మంచాల సరిత, బూర్ల నర్మద, తుమ్మల అన్నపూర్ణ, ఇజ్జగిరి సంజయ్, సయ్యద్ జీషాన్ అలీ, గజ్జల విజయ, షేక్ హీనా సబీన్, రుహీనా ఫాతిమా, మహబూబ్, నగ్మా సిద్దిఖీ, మిటాపూరే శాలిని, సాయిచరణ్ గౌడ్, స్వాతి కాంబ్లేతో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ వై.వెంకటేశ్వరరావు అన్నారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక సత్తుపల్లి టాలెంట్ స్కూల్లో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలు, గాయపడిన వారిని ఎలా రక్షించాలి అనే అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు రెస్క్యూ పద్ధతుల ద్వారా ప్రజలను కాపాడవచ్చని తెలిపారు. అలాగే ఇంట్లో జరిగే గ్యాస్ ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీపీఆర్ విధానం ద్వారా ఎలా రక్షించాలో ప్రయోగాత్మకంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, జి.రవికాంత్, వై.అనిల్ కుమార్, కె.బాబురావు, టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ పులి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ పులి అరుణ, స్కూల్ ఇంచార్జ్ శంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

